ప్రజాశక్తి

ఆదివారం 16 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



ప్రజాసేవకే ఎన్టీఆర్ ట్రస్ట్ అంకితం

మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజాసేవకే ఎన్టీఆర్ ట్రస్ట్ అంకితమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ 28వ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా బాధితుల కోసం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం రాత్రి మ్యూజిక్ డైరెక్టర్ తమన్ నేతృత్వంలో "యుఫోరియా మ్యూజికల్ నైట్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియా బాధితులకు అండగా నిలిచేందుకే నిర్వహించిన యూఫోరియా మ్యూజికల్ నైట్‌కు ప్రజల స్పందన చూశాక మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే ధైర్యం, ప్రోత్సాహం వచ్చాయన్నారు. తలసేమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి, ఆ వ్యాధితో బాధపడే బిడ్డలను ఆదుకుంటామన్నారు. బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ను 1997 ఫిబ్రవరి 15న ఏర్పాటు చేశామని 28 ఏళ్ల ట్రస్ట్ ప్రయాణంలో ఆరోగ్యం, విద్య, విపత్తు సహాయం, ఉపాధికల్పన, మహిళా సాధికారతకు విశేష సేవలందిస్తూ, లక్షలాది మందికి సాయం చేస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుంటుందన్నారు. ట్రస్ట్ ద్వారా హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరంలో నాలుగు బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్నామని, 4.91 లక్షల యూనిట్ల రక్తం దాతల నుంచి స్వీకరించి, అవసరమైన 8.70 లక్షల మంది రోగులకు అందించామని తెలిపారు. 13 వేలకుపైగా వైద్య శిబిరాలు నిర్వహించి, 20 లక్షల మంది రోగులకు దాదాపు రూ.23 కోట్ల విలువైన మందులను అందించామన్నారు. సంజీవని ఉచిత క్లినిక్‌లో భాగంగా 4 మొబైల్ ఆసుపత్రుల ద్వారా 2 లక్షల మందికి ఉచిత వైద్యసేవలు అందించడం గొప్ప విషయమన్నారు. చదువుతోనే భవిష్యత్ అనే నానుడిని బలంగా నమ్మిన 2వేల మందికి పైగా అనాథపిల్లలకు ఉచిత విద్య, వసతి, ఆహారం అందించడంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుందన్నారు. 7,531 మందికి టైలరింగ్, నెట్ వర్కింగ్, స్కిల్ డెవలప్‌మెంట్



మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

(మిగతా 2లో)

వేడెక్కిన ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

- లక్ష్మణరావుకు ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల మద్దతు
- ఆలపాటికి మద్దతుగా కూటమి నేతల పర్యటనలు

ప్రజాశక్తి - గుంటూరు ప్రతినిధి

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఈనెల 27న జరిగే ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 25 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 10 మంది నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. 30 మంది నామినేషన్లను ఆమోదించారు. వీరిలో ఐదుగురు ఉపసంహరించుకోవడంతో 25 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ పలు ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు, టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మధ్య నెలకొంది. ఈనెల 10న గుంటూరులో లక్ష్మణరావు నామినేషన్ కార్యక్రమానికి పట్టభద్రులు భారీ సంఖ్యలో హాజరు కావడం... టిడిపి కూటమి నేతలను కలవరపాటుకు గురిచేసింది. దీంతో కూటమి నేతలు అన్ని శక్తియుక్తులను ఉపయోగించేందుకు ప్రయత్నిస్తున్నారు. 14 ఏళ్లు ఎంఎల్‌సిగా ఉన్న కెఎస్ లక్ష్మణరావుకు ఉన్న ప్రజా సంబంధాలతోపాలు ప్రజా సంఘాల మద్దతు ఆయన గెలుపునకు సానుకూల అంశాలుగా ఉన్నాయి. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు టిడిపిలో అంతర్గతంగా ఉన్న ప్రతికూల పరిస్థితులు ఆయనకు ఇబ్బందికరంగా మారాయి. పార్టీ అధినాయత్వం జోక్యం చేసుకుని ఆలపాటికి సహకరించని వారిని బుజ్జగించే ప్రయత్నం చేస్తోంది. ఆలపాటిని తీవ్రంగా వ్యతిరేకించిన ధూళిపాళ్ల నరేంద్రను మాజీ మంత్రి దేవినేని ఉమా బుజ్జగించినట్లు తెలిసింది. అంతేగాక ఆలపాటి గెలిస్తే తమ ఉనికికి ఇబ్బంది వస్తుందనే భయం కొంత మంది టిడిపి నాయకులను వెంటాడుతోంది. పైకి అందరూ ఐక్యంగా కలిసి పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నా అంతర్గతంగా కూటమిలో ఆయనకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే టిడిపి అధిష్టానం మాత్రం ఆలపాటి గెలుపునకు అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తోంది. ఈనెల 25న ప్రచారానికి తెర పడనుండడంతో అభ్యర్థులతా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టభద్రులుగా ఉన్న ఓటర్లను కలుసుకునేందుకు కెఎస్ లక్ష్మణరావు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల



కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా



పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు

(మిగతా 2లో)

పన్నులు సక్రమంగా చెల్లించడమూ దేశ సేవే

- ఆదాయ పన్ను చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పన్ను ఏదైనా అది దేశభక్తితో, దేశానికేమైన చేయాలన్న సంకల్పంతో పన్నులు చెల్లించాలని ఆదాయ పన్ను చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా సూచించారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దేశం శక్తివంతంగా ఎదగాలంటే అందరూ పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించకపోవడం నేరం, దేశద్రోహమే కాకుండా, అది వారి ఆరోగ్యానికి హానికరంగా కూడా కావచ్చన్నారు. దేశానికి ప్రధాన ఆదాయ వనరులు కస్టమ్స్, జిఎస్‌టి, ఇన్ కమ్ ట్యాక్స్ లేనని పేర్కొన్నారు. కస్టమ్స్ ఆదాయం దేశ ఆర్థిక సుస్థిరతకు, దేశ ఆర్థిక ప్రగతికి కీలకంగా మారిందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ మాట్లాడుతూ కస్టమ్స్ ఉద్యోగులు దేశ ఆర్థిక పరిపుష్టికి మూల స్తంభాలని, దేశ భవిష్యత్‌కు దశ, దిశా నిర్దేశకులని కొనియాడారు. కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలో ఈ ఆర్థిక ఏడాది జనవరి

(మిగతా 2లో)



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆదాయ పన్ను చీఫ్ కమిషనర్ మెహతా

బిల్లులు ఎప్పుడిస్తారు ?

- 2018లో 137 విఆర్‌వో కార్యాలయాల నిర్మాణం
- మొత్తం వ్యయం రూ.6.35 కోట్లు
- చెల్లించిన మొత్తం రూ.2.74 కోట్లు మాత్రమే
- పెండింగ్ బకాయిలు రూ.3.61 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

పూర్తయిన భవనాల బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. 2018లో నిర్మించిన గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్‌ఒ) కార్యాలయాల బిల్లులను గత వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు మంజూరవుతాయని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఎనిమిది నెలలుగా బిల్లుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిర్మాణాలకు పెట్టిన పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుల వడ్డీలు ఆరేళ్లలో రెట్టింపయ్యాయని పలువురు వాపోతున్నారు.

2018 సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామ రెవెన్యూ అధికారులు (విఆర్‌ఒ)లకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో మూడు దశల్లో కార్యాలయాలు నిర్మించారు. నామినేషన్ పద్ధతిలోనే

(మిగతా 2లో)



చల్లపల్లి మండలం పాగోలులో నిర్మించిన భవనం



ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యాలయంలో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - విజయవాడ : స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమం విజయవాడ ప్రజారవాణా అధికారి వారి కార్యాలయంలో శనివారం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం మాట్లాడుతూ ...ఆంధ్ర రాష్ట్రంను స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దడానికి మన వంతు కృషి చేయాలన్నారు. ఇంటిని, ఇంటి పరిసరాలను , ఆఫీసును ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయాలన్నారు. బయో వ్యర్థాలను కూడా వేరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎ జాన్ సుధాకర్, పి వెంకటరమణ, పర్సనల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - విజయవాడ : పోలీస్‌స్టేషన్, పరిసర ప్రాంతాలను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు శుభ్రపరిచారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నేతృత్వంలో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్లలో సిబ్బందితో పోలీస్ స్టేషన్, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.



వ్యర్థాల నుండి సంపద తయారీపై అవగాహన అవసరం

చీఫ్ సెక్రటరీ విజయానంద్ విజయవాడలో పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఇంటి వద్దనే వ్యర్థాలను వేరుచేసే ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం విజయవాడలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆయన స్థానిక 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ఆయుర్వేద హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విఎంసి ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను విజయానంద్ సందర్శించారు. అనంతరం వాకథాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాజీవ్ నగర్‌లో మొదలుపెట్టి, సుందరయ్య నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో స్వయంగా తానే ప్రజల వద్దకు వెళ్లి మూడు రంగుల చెత్త బుట్టలు, వాటిలో వేయవలసిన వ్యర్థాలు గురించి అవగాహన కల్పించడమే కాకుండా వారు వాడుతున్న చెత్త బుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ కే.విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పట్ల తమ బాధ్యతను నిర్వహించాలని కోరారు. ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి వ్యర్థాల నుండి సంపదను సృష్టించాలని తడి చెత్త, పొడి చెత్త వేరువేరు చేసి వాటిని రీసైకిల్ చేసే విధంగా అందరూ



సహకరించాలని అన్నారు. అందుకు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలకు, మూడు రకాల బుట్టలను నగరపాలక సంస్థ ప్రజలకు అందించడమే కాకుండా ఇంటి వద్దనే వ్యర్థాలు వేరుచేసి ఇవ్వాలని అవగాహన కల్పించే కార్యక్రమాన్ని విస్తతంగా చేస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను రీసైకిల్ చేసి, సంపదని సష్టించవచ్చని తెలిపారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ పై విజయవాడ నగర పాలక సంస్థ విస్తతమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తోందని, ప్రజలకు వినియోగదారులకు వాటిపై ప్రస్తుతం అవగాహన కల్పిస్తున్నారని, అతి త్వరలో వాటిపై ఎన్ఫోర్స్మెంట్ కూడా పెట్టబోతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ సురేష్ బాబు, జాన్ డైరెక్టర్ డాక్టర్ లతా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, బయాలజిస్ట్ సూర్య నాయక్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : రహదారులపై జరిగే ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోకుండా రహదారుల భద్రత, రవాణా శాఖల సూచించిన నిర్దిష్ట ప్రమాణాలు పాటించటం తో పాటు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్లను తప్పనిసరిగా ధరించి ఎన్టీఆర్ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గాంధీనగర్ లోని ఎన్జీజిఓ హోమ్ లో శనివారం జరిగింది. ఈకార్యక్రమంలో ఏపీ ఎన్జీజీవో ప్రధాన కార్యదర్శి ఎ. విద్యాసాగర్, రవాణా శాఖ



ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం. రాజుబాబు, డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం. సుహాసిని, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్ ప్రభుదాసు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

బిల్లులు ఎప్పుడిస్తారు ?

తహశీల్దార్‌లే పనులు కేటాయించారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్లు కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్లు ఆసక్తి చూపని ప్రాంతాల్లో ఆయా గ్రామాల్లో పనిచేసే విఆర్‌ఒలకు పనులు అప్పగించారు. మొదటి దశలో ఒక్కో మండలానికి ఒక్కో కార్యాలయం నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఒక్కో భవనానికి రూ.4 లక్షల చొప్పున ఖర్చు చేసి 50 మండలాల్లో రూ.2 కోట్లతో 50 భవనాలను నిర్మించారు. భవన నిర్మాణానికి రూ.4 లక్షలు చాలడం లేదని వర్కులు చేసిన కాంట్రాక్టర్లు, విఆర్‌ఒలు వాపోయారు. అంతేగాక రెండు, మూడు దశల్లో పనులకు ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో ఒక్కో భవన నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం రూ.5 లక్షలకు పెంచింది. రెండో దశలో 15 మండలాల్లో మండలానికి మూడు చొప్పున 45, మూడో దశలో 14 మండలాల్లో మండలానికి మూడు చొప్పన 42 భవనాలను నిర్మించారు. మొత్తం 137 కార్యాలయాలకు రూ.6.35 కోట్లతో భవనాలను నిర్మించారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఒక్కో విఆర్‌వో భవనానికి రూ.2 లక్షల చొప్పన రూ.2.74 కోట్ల మేర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మరో రూ.3.61 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ పెట్టింది. ఈ బిల్లుల కోసం పలువురు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కూటమి అధికారంలోకొచ్చి 8 నెలలైనా విడుదల కాని బిల్లులు

2018లో టిడిపి హయాంలో నిర్మించిన భవనాలకు బిల్లుల చెల్లింపును గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. భవన నిర్మాణాలకు చేసిన అప్పులకు వడ్డీలు రెట్టింపవుతున్నాయని వాపోయారు. గత ఐదేళ్లలో కాంట్రాక్టర్లు, విఆర్‌ఒలు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా స్పందించలేదు. కూటమి అధికారంలోకి రావడంతో విఆర్‌ఒ భవన నిర్మాణ బిల్లులు మంజూరవుతాయని ఆశించారు. కానీ ప్రభుత్వం గత ఎనిమిది నెలల్లో ఈ బిల్లుల చెల్లింపుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్లు, విఆర్‌ఒలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన తమను బిల్లులు చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజాసేవకే ఎన్టీఆర్ ట్రస్ట్ అంకితం

శిక్షణ అందించి ఉపాధి కల్పించామన్నారు.కోవిడ్ సమయంలో 3 లక్షల మాస్కులతో పాటు ఉచిత మందులు అందించామని, రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో రూ.కోట °30లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్లను ట్రస్ట్ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. విజయవాడ, కర్నూలు, గోదావరి వదరలు, హుద్ హుద్ తుఫాన్ వంటి విపత్తుల సమయంలో లక్షలాది మంది నిరాశ్రయులకు అండగా నిలిచామన్నారు. కడప జిల్లాలో అన్నమయ్య డ్యామ్ గేట్లు కొట్టుకుపోయినప్పుడు ఆ ప్రాంతాల్లో ప్రాణాలు కోల్పోయిన 48 కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశామన్నారు. ఇప్పటివరకు 22లక్షల మందికి విపత్తుల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సాయంచేసిందని తెలిపారు.

ఎన్‌టిఆర్ ట్రస్టు అంటే పేదల ముఖంలో చిరునవ్వు : లోకేష్

ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదవారి ముఖంలో చిరునవ్వు, నమ్మకమని అన్నారు. తలసీమియా బాధితులకు సహాయం చెయ్యడానికి ముందుకు వచ్చిన అందరినీ అభినందించారు. అధికారంతో సంబంధం లేకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమైనవన్నారు. ఆపన్నులకు అండగా నిలుస్తూ సహాయక చర్యల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అవసరమైన వారికి సకాలంలో సమర్ధవంతమైన సేవలను అందిస్తోందన్నారు.

పన్నులు సక్రమంగా చెల్లించడమూ దేశ సేవే

వరకు రూ.11,480 కోట్ల కస్టమ్స్ వసూళ్లు సాధించి, లక్ష్యానికి చేరువలో వున్నామని తెలిపారు. ఈ విజయంలో అధికారుల సామర్థ్యాన్ని, అవిశ్రాంత కషిని కమిషనర్ అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.16.16 కోట్ల విలువైన 20.5 కిలోల బంగారం, రూ.28.3 కోట్ల విలువైన 83 లక్షల సిగరెట్ స్టిక్‌లు, 10 టన్నుల చైనీస్ వెల్లుల్లి, ఈ-సిగరెట్లు, రూ.10 లక్షల విలువైన డ్రోన్లు స్వాధీనం చేసుకున్నామని నరసింహారెడ్డి వెల్లడించారు. వీటిని రవాణా చేస్తున్న 19 మందిని అరెస్టు చేశామన్నారు. ఉద్యోగ విధులతో పాటు, తలసేమియా రోగుల చికిత్సకు రాష్ట్రంలో 52 చోట్ల రక్తదాన శిబిరాలు పెట్టి, 4059 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. బెజవాడ వరదల్లో చిక్కుకున్న 200 మందిని రక్షించడమే కాకుండా, బాధితులకు రూ.12 లక్షల విలువైన 1400 సహాయ సామాగ్రి కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎపి బాడీ డోనార్స్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మిని, తమ అవయాలను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేసిన 36 కస్టమ్స్ ఉద్యోగులను అతిధుల చేతులమీదుగా కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఐరన్ మ్యాన్, ట్రయాథ్లాన్, సైక్లింగ్, మారథాన్, స్విమ్మింగ్‌లలో పాల్గొన్న స్ఫూర్తిదాయక వ్యక్తులను హెల్త్ హీరోలుగా సన్మానించారు. టాప్ ట్యాక్స్ పేయర్స్‌ను, ఉత్తమ ఉద్యోగులను జ్ఞాపికలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందచేసారు. విశిష్ట సేవలందించిన విశ్రాంత ఉద్యోగులను శాలువాతో గౌరవించారు. క్రీడలలో విజేతలైన ఉద్యోగులు, వారి పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు. కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈకార్యక్రమంలో కస్టమ్స్ అదనపు కమిషనర్లు కాకరాల ప్రశాంత్ కుమార్, జి.రామకష్ణరాజు యాదవ్, అబ్దుల్ అజీమ్, వేణు తదితర అధికారులు పాల్గొన్నారు.

వేడెక్కిన ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

పరిధిలోని 33 నియోజకవర్గాల్లో 3.46 లక్షల మంది ఓటర్లను కలుసుకునేందుకు అభ్యర్థులు... తమకు మద్దతు ఇస్తున్న సంఘాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. లక్ష్మణరావు ఇప్పటికే తొలి విడత ప్రచారం ముగించారు. తనకు మద్ధతు ఇస్తున్న వివిధ సంఘాల నేతలు, ఆయా సంఘాల శ్రేణులు ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నాయి. ఇప్పటికే వివిధ ప్రజా సంఘాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, నిరుద్యోగులు లక్ష్మణరావుకు మద్దతు ఇస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, నిరుద్యోగులతోపాటు రైతులు, కౌలు రైతులు, చేనేత కార్మికులు, స్కీం వర్కర్లు ఇలా అనేక రంగాలకు చెందిన వారి సమస్యలను గత 14 ఏళ్లుగా శాసనమండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం కృషి చేసిన విషయాన్ని లక్ష్మణరావు ఎన్నికల ప్రచారం ప్రస్తావిస్తున్నారు. దీంతో ఆయా తరగతుల వారు లక్ష్మణరావుకు మద్ధతు ఇస్తారని పరిశీలకులు భావిస్తున్నారు. అంతేగాక మండలిలో ప్రజా సమస్యల ప్రస్తావన రావాలంటే లక్ష్మణరావు గెలుపుతోనే సాధ్యమని ఆయా రంగాలకు చెందిన సంఘాలు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై మండలిలో పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా ప్రజాగళం విన్పించారని గుర్తుచేస్తున్నారు. రాజ్యాంగ నిర్మాతలు పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా మండలిలో కొన్ని స్థానాలు కేటాయిస్తే వీటిలోకి రాజకీయ పార్టీలు ప్రవేశించి పోటీ చేయటం వల్ల ప్రజలకు మేలు జరగదని లక్ష్మణరావు ప్రజలకు వివరిస్తున్నారు. మరోవైపు టిడిపి అభ్యర్థి ఆలపాటికి కూటమి పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. ఆయా పార్టీల నాయకులు ఆయనకు మద్ధతుగా గ్రామ స్థాయి నుంచి సాధారణ ఎన్నికల మాదిరిగా ప్రచారం చేస్తున్నారు. అధికారం, ఆర్థిక, అంగబలాన్ని ఉపయోగిస్తున్నారు.

భూవివాదాలకు తావు లేకుండా రీసర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : భవిష్యత్తులో ఎటువంటి భూ వివాదాలకు తావు లేకుండా భూముల రీ సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహి స్తున్న రీసర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం లో భాగంగా జిల్లా కలెక్టర్ డికే బాలాజీ శనివారం గూడూరు మండలం కలపటం గ్రామంలో రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో రైతుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా రీసర్వే జాగ్రత్తగా చేపట్టాల న్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని రీ సర్వే చేపడుతున్నామని, ప్రభుత్వం రూపొందించిన రీసర్వే ఎస్ఒపి మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద జిల్లాలో ఎంపిక చేసిన 23 గ్రామాలలో ప్రతి గ్రామానికి నాలుగు టీంలు, కమ్యూనికేషన్ టీం రీసర్వేలో పాల్గొన్నా రన్నారు.


చల్లపల్లిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి : లయన్స్ క్లబ్అఫ్ వి ఆర్ కె నగర్ ఆధ్వర్యంలో సజ్జా భారతి జ్ఞాపకార్థం భర్త సజ్జా ప్రసాద్ అందించిన ఆర్థిక సాయంతో శనివారం లయన్ నర్ర రమాదేవి సాయిబాబా మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లో నిర్వహించిన నేత్ర చికిత్స శిబిరంలో 43కి నేత్ర పరీక్షలు నిర్వహించగా ఐఓఎల్ శస్త్ర చికిత్స కు ఏడుగురిని గుర్తించి గూడూరు లోని సాయి నేత్ర నేత్రాలయానికి శస్త్ర చికిత్స నిమిత్తం పంపించారు. ఈ శిబిరాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ ఎడిషనల్ సెక్రటరీ లయన్ నర్రా సాయిబాబు , చల్లపల్లి లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ కస్తూరి వెంకట వరప్రసాద్,కోశాధికారి లయన్ ముమ్మనేని నానిలు పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక లయన్స్ సేవా భవనం నందు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. లయన్ కొల్లి రాజేష్ ఆర్థిక వితరణతో 20 మందికి కంటి పరీక్షలు నిర్వహిం చగా వారిలో 13మందికి శుక్లముల ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం : డిఆర్ఓ


మాట్లాడుతున్న డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు అన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ప్రతి అంశాన్నీ వారు పరిశీలించి సాధారణ పరిశీలకు లకు నివేదిక పంపాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో శనివారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సూక్ష్మ పరిశీలకు (మైక్రో అబ్జర్వర్స్) కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన కృష్ణా- గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరుగుతుం దన్నారు. ఈ ఎన్నికకు జిల్లాలో 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించా మన్నారు. సూక్ష్మ పరిశీలకులు ముందుగా ఆయా పోలింగ్ కేంద్రపరిధిలో కనీస సౌకర్యాలను తనిఖీ చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక ఇవ్వటం జరగాలన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. సీక్రెసీ ఆఫ్ ఓటు ఉండేలా చూడాలని, నిబంధనలు మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్వో తో పాటు కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరమ్మ తిరునాళ్లలో యాత్రికుల సందడి


తిరునాళ్ళలో అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వెళు తున్న పారుపూడి వంశస్థులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ పెరుగుతుంది. తిరునాళ్ళలో 8వ రోజైన శనివారం అమ్మవారికి పారుపూడి వంశస్థులు డప్పువాయిద్యాలు, గొర్రెపొటేళ్లు, పాల పొంగళ్లతో వైభవంగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఉదయంనుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్ళ తయారుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. చీర సారె, పసుపు కుం కుమ సమర్పించి భక్తులు చల్లగా దీవించుతల్లి అని ప్రార్థించారు. శనివారం రాత్రి పొద్దు పోయేవరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

రెండోరోజుకు ఆర్టీసి కార్మికుల దీక్షలు


దీక్షల్లో కూర్చున్న ఆర్‌టిసి కార్మికులు


ప్రజాశక్తి-ఉయ్యూరు : డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్లో డిపో మేనేజర్ పక్షపాత, మొండి వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు శనివారం రెండో రోజు రిలేదీక్ష కొనసాగించారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస రావు, సభ్యుడు డీకే రావు రిలే దీక్షను ప్రారంభించారు. కేంద్రకార్యాలయం జారిచేసిన సర్క్యులర్కు వ్యతిరేకంగా నిర్వహించిన చార్ట్ కౌన్సిలింగ్ రద్దుచేసి తిరిగి న్యాయబద్ధం గా కౌన్సిలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిం చిన చార్ట్ కౌన్సిలింగ్ రద్దుచేయాలని 60 మంది కార్మికులు కోరుతూ పదిరోజులుగా ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరవుతున్నా డిపో మేనేజర్ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏ రాజేష్ కుమార్, జి సుబ్బారావు దీక్షలు పాల్గొనగా డిపో కమిటీ సెక్రటరీ పీఎం కృష్ణ, ప్రెసిడెంట్ కేవస్ రావు ఇతర నాయకు లు, సభ్యులు, ఇతర డిపోల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

ప్రైవేటుకు పంట కాల్వల నిర్వహణ తగదు

ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ) : పంట కాలువల నిర్వహణ బాధ్యతలు ప్రైవేటుకు అప్పగించరాదని ఏపీ కౌలు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మొవ్వ మండలం పరిధిలోని కూచిపూడిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ కాలువల నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు క్లీన్ వెల్త్ పీట్ మర్వెక్ గో డీలర్ (కెపిఎంజి) ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిందన్నారు. భవిష్యత్తులో ఒక ఎకరానికి పంట కాలువ ద్వారా రైతు నీరు వాడుకుంటే ప్రైవేట్ కంపెనీకి 1946 రూపాయలు చెల్లించాల్సి వస్తుందని అధ్యయనంలో తేలిందని వివరించారు. నీటి వినియోగ లెక్కలు తీసేందుకు కాలువల గేట్ల వద్దే వాటర్ గేజ్ లు (నీటి మీటర్లు) ఏర్పాటు చేయాలని, తొలి దశలో వసూలు బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీలకే అప్పగించకుండా లస్కర్ల ద్వారా వసూలు చేయించాలని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసిందన్నారు. కావున రాష్ట్రంలోని జిల్లా, మండల స్థాయి లో రైతాంగం రైతు వ్యతిరేక విధానాల పై రాష్ట్ర ప్రభుత్వం పెట్టే నీటి మీటర్ల ఏర్పాట్లు వ్యతిరేకించాలని కోరారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి కాలువలకు మీటర్లు పెట్టి నీటి తీరువా వసూలు చేసేందుకు ప్రయత్నం చేయటం రైతాంగానికి గొడ్డలి పెట్టు లాంటిదని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు విమర్శించారు. శనివారం అవనిగడ్డలోని ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద కౌలు రైతుల సంఘం నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సాగునీటి కాలువలకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తే రైతులు తీవ్రంగా ప్రతిఘటించి వాటిని ధ్వంసం చేయడంతో అప్పటి ప్రభుత్వం పునరాలోచన చేసి విరమించుకుందన్నారు. తిరిగి మరలా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సాగునీటి కాలువలకు మీటర్లు బిగించి డబ్బులు వసూలు చేయలనుకోవడం తగదన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు వాకా రామచంద్రరావు, సహాయ కార్యదర్శి ఎం సురేష్‌బాబు, కాండు బైరాగి, పడమటి దుర్గారావు పాల్గొన్నారు.


అవనిగడ్డలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన వెంకటస్వామి

ప్రజాశక్తి-కంకిపాడు : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం కంకిపాడు మండలం, కొణతనపాడు-ప్రొద్దుటూరు మధ్య తాళ్లూరి హైట్స్లో నివాసం ఉండే మట్టా వెంకట స్వామి(62) శుక్రవారం సాయంత్రం ఏడున్నరకు వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అనుమానాస్పద స్థితిలో వెంకటస్వామి కంకిపాడు శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమీ దగ్గరలో రోడ్ పక్కన చనిపోయి ఉన్నారు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానస్పద మతిగా కేసు నమోదు చేసి మత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


పోలీసులకు సూచనలిస్తున్న డిఎస్పి ధీరజ్

ప్రజలతో స్నేహంగా మెలగాలి : డిఎస్పి

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజలకు పోలీసులు జవాబు దారిగా ఉంటూ, పోలీసులు ప్రజలతో స్నేహభావంతో ఉండాలని గుడివాడ సబ్ డివిజన్ పోలీసు అధికారి ధీరజ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ను డియస్పి ధీరజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్కు సంబంధించి ఎస్.ఐ ప్రసాదరావుతో చర్చించి, కొన్ని సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ఎప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, కారును ఉపయోగించే వారు సీటు బెల్ట్ను పెట్టుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐలు భాగ్యవతి, రత్నరాజు, శంకరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

కార్మికులకు ఇ-శ్రమ్ నమోదు



ఇ-శ్రమ్ నమోదు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నందివాడ : రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం ఇ - శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్లు జనార్ద నపురం (జొన్నపాడు) సెంటర్లో శనివారం నిర్వహించారు. ఈ-శ్రమ్ పోర్టల్లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గుడివాడ లేబర్ ఆఫీసర్ వి.ఎస్ బిందు సూచించారు. ఈ మేరకు ఈ పథకంతో ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించాలని అధికారుల్ని కోరారు . కార్మికులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనం ఉందని అన్నారు. ఇ -శ్రమ్ పోర్టల్లో ఇప్పటివరకు 26-8-2021 సంవత్సరం నుండి గుడివాడ రూరల్ పెదపారపూడి, నందివాడ మండలాలలో 43,500 కార్డులను అర్హతకలిగిన వారికి రిజిస్టర్ చేశారని, మిగతా వారు కూడా త్వరగా రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. కార్మికుడు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి రూ.2 లక్షల బీమా దక్కుతుందని, ఒకవేళ అంగవైకల్యం అయితే రూ.1 లక్ష వరకూ లబ్ధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎండిఓ మల్లీశ్వరి, గుడివాడ లేబర్ ఆఫీసర్ వి.ఎస్ బిందు, నీలం మురళీకృష్ణారెడ్డి, సతీష్, భాను, నారాయణ పాల్గొన్నారు.

తమన్ మ్యూజికల్ నైట్ దృశ్యాలు


సంగీత కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్



పాటలు పాడుతున్న సింగర్స్


కార్యక్రమంలో పాల్గొన్న సంగీత అభిమానులు


మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బాలకృష్ణ




అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, లోకేష్



డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

పలుచోట్ల స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి - చందర్లపాడు : మండలంలోని చందర్లపాడు, ముప్పాళ్ళ గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీలో సోర్స్ అండ్ రిసోర్స్ థీం మీద గ్రామాల్లో జరుగుతున్న డోర్ టు డోర్‌కు గార్బేజ్ కలెక్షన్, తడిపొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి ఈ థీమ్‌పై గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించారు. గ్రామస్తులతో స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గార్బేజ్ హిప్స్ వద్ద శ్రమదానంలో పాల్గొని ఆ ప్రదేశంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపిడిఒ ఎస్‌వి.నాంచారయ్య, మండల పిఒపిఆర్‌డి, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి గ్రామపంచాయతీ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిరాం, వెలుగు సిసి, వెలుగు విఒఎలు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణ పురపాలక సంఘ పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలలో 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం కమిషనర్ ఎం.రామ్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు అందరూ తడి చెత్త - పొడి చెత్తను వేరు చేయటం ఇంటి నుండి వచ్చే తడి చెత్తను పచ్చ రంగు డబ్బాలో, పొడి చెత్తను బ్లూ రంగు డబ్బాలో, ప్రమాదకర వ్యర్థాలను ఎరుపు రంగు డబ్బాల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వాణిజ్య సముదాయాల్లో ఆరు బయట, రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన కల్పించారు. **నందిగామ :** నందిగామ జిల్లా పరిషద్ హై స్కూల్‌లో విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్త పై మున్సిపల్ కమిషనర్ రమణబాబు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంట్లో నిరూపయోగంగా ఉన్న వస్తువులతో ఉపయోగపడే వస్తువులు తయారు చేసి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. సదరు ఎగ్జిబిషన్‌లో కమిషనర్ పరిశీలించి ప్రతిభ కనపరచిన 13 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. నారాయణ ఆంగ్లో వేదిక్ స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలను కమీషనర్ తిలకించి ప్రతిభ కనపరచిన 12 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కమిషనర్ ఇ.వి.రమణ బాబును జిల్లా పరిషద్ హై స్కూల్ విద్యార్థులు శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.గురునాథం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.నిర్మల, శానిటరీ మేస్త్రి , సచివాలయ వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రేటరీస్ పాల్గొన్నారు.


లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయులను, నాయకులును, పలువురి గ్రాడ్యుయేట్లను కలిసి కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరుతూ పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్, విద్యా వేత్త, మేధావి, విటపు బాలసుబ్రమణ్యం ప్రచారం చేస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు 1 వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విజయవాడ సింగ్‌నగర్ పలు ప్రాంతాల్లో ఉన్న పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్, యాజమాన్యాలు పలువురు మద్దతు తెలుపుతూ లక్ష్మణరావు గురించి మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ గుర్తింపు కార్డు, వారికి హెల్త్ కార్డ్ సౌకర్యం కల్పన వంటి అంశాలపై మాట్లాడిన అంశాల గురించి వివరించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో విస్తృతంగా ఓట్లు కోరుతూ ప్రచారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వి.మురళి మోహన్, నగర కార్యదర్శి వెలగా శ్రీనివాస్, చెకుముకి జిల్లా కార్యదర్శి షేక్ ఇమామ్, పాల్గొన్నారు. జయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో కృష్ణా గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **మైలవరం :** కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మైలవరం మండలంలో పలు ప్రజా సంఘాల నాయకులు శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ లక్ష్మణరావు ప్రజా గొంతుక అని ఆయనను చట్టసభలకు పంపిస్తే ప్రజా సమస్యల గురించి చర్చిస్తారని అన్నారు. పుల్లూరు, మైలవరం, చంద్రాల, గణపవరం, వెల్వడం తదితర గ్రామాల్లో ఉన్న ఓటర్లను కలిసి లక్ష్మణరావుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.సుధాకర్, నాయకులు వసంత రావు, గంగరాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** కెఎస్ లక్ష్మణరావు గెలుపును కోరుతూ మండలంలోని చిల్లకల్లు, పట్టణంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కెఎస్.లక్ష్మణరావు పిడిఎఫ్ తరపున 2007, 2009 టీచర్ ఎమ్మెల్సీగా 2019 గార్డియట్ ఎమ్మెల్సీగా గెలుపొంది కృష్ణా-గుంటూరు జిల్లాల్లో నిర్మాణాత్మక కృషి చేశారని, **కంచికచర్ల :** మండలం లో కొత్త పేట, చెవిటికల్లు, కునికునిపాడు, మున్నలూరు, మోగులూరు, అమరవరం, వేములఫల్లి, పిండ్యాల.గండేపల్లి గ్రామాల్లో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ప్రజా సంఘాల కార్యకర్తలతో కలిసి ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, పాఠశాలలు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్లను కలిసి లక్ష్మణరావు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కోట కల్యాణ్ మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘమేశ్వరావు, రఫీ, వెంకట్రావు సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నందిగామ మెయిన్ బజార్ నందు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు కటారపు గోపాల్, గోపి నాయక్, మన్నెం వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


సింగ్‌నగర్‌లో మాట్లాడుతున్న విటపు బాలసుబ్రహ్మణ్యం


మైలవరంలో ప్రచారం...


నందిగామలో ప్రచారం...


కంచికచర్లలో ప్రచారం...

కెఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం


మొవ్వ మండలంలో...

ప్రజాశక్తి-చల్లపల్లి : కృష్ణా-గుంటూరు జిల్లాల ఉమ్మడి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణ్ రావు గెలుపు కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. చల్లపల్లి మండల కేంద్రంలోని, తాసిల్దార్, మండల పరిషత్, విద్యుత్, విద్యాశాఖ అధికారి, వెలుగు, ఉపాధి హామీ పథకం కార్యాలయంలో, వ్యవసాయ శాఖ ఆర్ అండ్ బి, సచివాలయ కార్యాలయంలో తోపాటు ప్రభుత్వ ప్రైవేటు విద్య శాలలో ప్రచార నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక పెన్షనర్స్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు కర్షక మహిళ వివిధ ప్రజాసంఘాలు బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మణరావు గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బళ్లా తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఉన్న ఐసిడిఎస్ అధికారులు, కార్యకర్తలను కలిసి కెఎస్ లక్ష్మణరావు గెలుపుకి సహకరించాలని కోరారు. ఆత్కూరు స్కూల్ కాంప్లెక్స్‌లో మానికొండ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులను కలిసి కెఎస్ ను గెలిపించాలని కోరారు. అజ్మీరా వెంకటేశ్వరరావు, కె రామరాజు, కె సీతారామరాజు, పులి శ్రీనివాస్, పిల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఈనెల 27వ తేదీన జరగనున్న కష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ ప్రజా సంఘాలు బలపరిచిన కేఎస్ లక్ష్మణ్ రావును గెలిపించుకుంటేనే నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న పిలుపుని చ్చారు. శనివారం అవనిగడ్డ లోని పార్కు వద్ద డీఎస్సీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మణరావు ఎమ్మెల్సీగా ఇప్పటివరకు రాష్ట్రంలో నిరుద్యోగులకు అండగా ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకు వెళుతున్నారని అన్నారు. నిరుద్యోగులు చేస్తున్న అనేక ఉద్యమాలకు లక్ష్మణరావు అండగా నిలిచి పోరాడుతు న్నారని, అటువంటి వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవడం ద్వారా నిరుద్యోగు లు ఎదుర్కొంటున్న సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావుకు ఓట్లు వేయాలని డీఎస్సీ అభ్యర్థులకు కరపత్రాలు అందజేసి ఓట్ల అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పి రంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయుడు పాల్గొన్నారు. **ప్రజాశక్తి చల్లపల్లి (మొవ్వ) :** కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటుని వేసి గెలిపించాలని కోరుతూ వివిధ ప్రజాసంఘా నాయకులు మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు సంఘం కష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, కౌలు రైతు సంఘం నాయకులు రావు రమేష్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం గన్నవరం పట్టణంలో ప్రజాసంఘాల నాయ కులు విస్తత ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలుసుకొని కరపత్రాలు ఇచ్చారు. అందరి సమస్యలపై ప్రశ్నించే గొంతుక అయిన లక్ష్మణరావు కు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, ఉదయ భాస్కరరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల జడ్పీహెచ్ఎస్ వద్ద శనివారం పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యదిక మెజారిటీ తో గెలిపించాలని కోరుతూ ఉపాధ్యాయులకు ప్రజాసంఘాల నాయకులు వాకా రామచంద్రరావు, భలే రమేష్ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఇదే పాఠశాలలో ఐసిడిఎస్ శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు, అంగన్వాడీ కార్యకర్తలకు లక్ష్మణరావు గెలుపు కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు.


అవనిగడ్డ మండలంలో..


ఘంటసాలలో...


గన్నవరంలో...


ఉంగుటూరు మండలంలో..



విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-బంటుమిల్లి : రోడ్డు భద్రత వార్షికోత్స వాలలో భాగంగా రవాణశాఖాధికారులు ప్రజలకు రోడ్డు భద్రత రోడ్డు ప్రమాదాల నివారణ హెల్మెట్ ధరించవలసిన ఆవశ్యకతను వివరిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా బంటుమిల్లి విద్యార్థులకు సెయింట్ జోన్స్ పాఠశాలలో వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అనేకమంది విద్యార్థులు పాల్గొనగా వారిలో తమ పాఠశాల విద్యార్థులు బహతులు సాధించారని సెయింట్ జోన్స్ స్కూల్ డైరెక్టర్ సాబు జాన్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ డికె బాలాజీ బహుమతులు అందించారు. వ్యాసరచన మొదటి బహుమతి పి ప్రవళిక (తొమ్మిదవ తరగతి), ద్వితీయ బహుమతి కె ప్రస్తుత (9వ తరగతి), డ్రాయింగ్ లో ప్రథమ బహుమతి ఏ కతీజ (ఎనిమిదో తరగతి), ద్వితీయ బహుమతి పి రుతిక (8వ తరగతి), క్విజ్లో ప్రథమ బహుమతి వై కుసుమశ్రీ (తొమ్మిదో తరగతి) ద్వితీయ బహుమతి పి ప్రసన్న (తొమ్మిదవ తరగతి) బహుమతులు సాధించారన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మంత్రి



ప్రజాశక్తి-మోపిదేవి : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం దర్శించుకున్నారు. దేవా లయం ఆవరణలో గల నాగ పుట్టలో పాలు పోసి ఆయన మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన , ఆలయ అర్చక బందం మంత్రి కొల్లు రవీంద్రకు తీర్థప్రసాదాలను అందజేశారు.. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షులు నడకుదిటీ జనార్దన్ రావు, రావి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి తదితరులు ఉన్నారు. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకార్చన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నాను అన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : జాతీయ రహ దారి భద్రతా మాసో త్సవాల ముగింపు కార్యక్ర మంలో భాగంగా వివిధ పాఠశాలల్లో రహదారి భద్రతకు సంబంధించి విద్యా ర్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహి ంచారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తతీయ, స్థానాలు సాధించిన విద్యార్థులకు శనివారం కలెక్టరేట్లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసా పత్రం మరియు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులతో, బంధుమిత్రులు తో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించే విధంగా తెలియపరచాలని విద్యార్థులకు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో డిటిఓ బిఎస్ఎస్ నాయక్, ఎంవిఐలు ఎండి సిద్దిక్, నారాయణస్వామి, ఏ ఎం వి ఐలు సిహెచ్ సత్యనారాయణ , డి సోనిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఆర్‌టిఓ

ప్రజాశక్తి-గన్నవరం : స్కూల్ బస్సు డ్రైవర్లు సురక్షితంగా వాహనాలు నడిపేందుకు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వి.పద్మాకర్ సూచించారు. స్థానిక విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖ వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో గత నెల రోజులుగా జరుగుతున్న రోడ్డు భత్రత మాసోత్సవాలు శనివారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఏంవీఐ పద్మాకర్ తన స్వంత ఖర్చుతో 25 మంది స్కూల్ బస్సుల డ్రైవర్లకు బ్లడ్ గ్రూపింగ్, బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వాటికి సంబంధించిన ల్యాబ్ రిపోర్టులు, హెల్త్ కార్డులను సదరు డ్రైవర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్కూల్ బస్సుల నిర్వహణ విషయంలో యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించి హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలిపారు. వాహనం కండిషన్ విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో, డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల అంతే భాధ్యతగా ఉండాలని సూచించారు. ఎన్జీఓ ప్రతినిధి వాసు, ఏంవీఐలు జి.వి.ఎస్.ఎన్. మూర్తి, డివి రమణ పాల్గొన్నారు.


హెల్త్ కార్డులు అందజేస్తున్న ఎంవిఐలు

ముప్పాళ్ల సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : విద్యావికాస్ విద్యాసంస్థల అధినేత ముప్పాళ్ళ సుబ్బారావు మృతి ఎంతో బాధాకరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బైపాస్ రోడ్డులోని విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పాఠశాల ఛైర్మన్ ముప్పాళ్ళ సుబ్బారావు భౌతిక గాయానికి ముప్పాళ్ళ నాగేశ్వరరావు నివాళులు అర్పించారు. ఈ సంధ్భంగా ఆయన కుటుంబ సభ్యులను, పాఠశాల డైరెక్టర్ బొప్పన సాంబశివరావులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పాళ్ళ సుబ్బారావు సిపిఐ సానుభూతి పరుడుగా ఉంటూ అనేక కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా ఉండేవారన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన ఈ ప్రాంతంలో ఎంతోమందికి విద్యను అందించి ఉన్నత స్థితిలో ఉండేలా వారికి ప్రత్యేక శిక్షణ అందించే వారన్నారు. సుబ్బారావు మరణ వార్తను తెలుసుకుని పాఠశాల పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం చూస్తుంటే ఆయన విద్యకు ఏ విధంగా పెద్ద పీఠ వేశారో అర్థమౌతుందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గుడివాడ నియోజవర్గం సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, సిపిఐ నాయకులు సి.సాంబశివరావు, ముసునూరి పూర్ణచంద్రరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, నండూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


సుబ్బారావు భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

రహదారుల అభివృద్ధికి కృషి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రాహదారుల అభివద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఎంపి వల్లభనేని బాలశౌరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలోనే గుడివాడలోని రోడ్లు నిర్మించి, డివైడర్లు, నూతన టెక్నాలజీతో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే 216 పరిధిలో ఉన్న గుడివాడ ప్రధాన రహదారుల ఆధునీకరణకు వన్ టైం అప్రూవల్‌తో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గుడివాడ పక్కనుండి 216 గ్రీన్ ఫీల్డ్ హైవే వెళ్లనుందన్నారు. అతి త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అవుతుందన్నారు. అడ్డగోలు పార్కింగ్, ఇష్టారీతిన హాకర్స్ వ్యవహరించకుండా అధికారులతో కలిసి ప్లానింగ్ రూపొందిస్తామన్నారు.



గుంటుపల్లి పిహెచ్‌సిని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి పరిధిలోని గుంటుపల్లి-1 ను శనివారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌సిడిసిడి సర్వేను ధ్రువీకరించి, లబ్ధిదారులతో మాట్లాడారు. సర్వే యొక్క ప్రాముఖ్యత మరియు ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ఆరోగ్య విద్యను అందించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి, సర్వే సమయంలో ఎదురయ్యే గ్రౌండ్-లెవల్ సమస్యలను సమీక్షించారు.

ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డిఎంఎఫ్ విజయ కుమారి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు చేయడం తప్పనిసరి అని ఆ నమోదు ప్రక్రియ ప్రతి రైతు సేవా కేంద్రంలో జరుగుతుందని రైతులకు ఆమె వివరించారు. ఈ కార్యక్రమ పరిస్థితిని తెలుసుకునేందుకు విజయ కుమారి ఈ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ కుమారితో పాటు నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఐకె శ్రీనివాస్ మండల వ్యవసాయ శాఖ అధికారి కె.విజయకుమార్ గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గా చంద్రశేఖర్ రఘు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - వత్సవాయి : కృష్ణ - గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాచినేనిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి, ఎన్నికల్లో ఆలపాటిని ప్రథమ ప్రాధాన్యత ఓటు 1 అంకెపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, తాళ్లూరు, మాచినేనిపాలెం ఎంపిటిసి బొల్లా వెంకటేశ్వరరావు, డిసి 4 కెనాల్ చైర్మన్ చిట్టూరి సుభాష్, నాయకులు బొల్లా శంకర్, ధారావత్ శివ నాయక్, బొల్లా మురళీ, కాకాని భూషణం, రాజ్‌కుమార్, షేక్ ఖాదర్, వెంకటరత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో యాత్రికుల సౌకర్యార్థం నిత్యం జరిగే అన్నదానానికి విజయవాడ వాస్తవ్యులు ఆచంట విష్ణువర్ధన్ రూ.లక్ష, గోవుల సంరక్షణ నిమిత్తం రూ.40 వేలు, ముగ్గురు దాతలు అన్నదానం నిమిత్తం రూ.15001 నగదు రూపంలో విరాళంగా అందజేసినట్లు దేవస్థాన వంశపారం పర్యధర్మకర్త, డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

సూర్య ఘర్ పథకంపై సమీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సంయుక్త మండల స్థాయి బ్యాంకర్ల సమితి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల స్థాయి బ్యాంకర్స్ అందరూ సూర్య ఘర్ పథకానికి సంబంధించిన ఏ లబ్దిదారుల అప్లికేషన్ వచ్చిన తిరస్కరించవద్దని వారికి కావలసిన సహకారాన్ని తాము అందిస్తామని అందుకు సహకరించవలసినదిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఎ ఎల్డిఎం బ్యాంక్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ మరియు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సుమారు ఎనిమిది వేల మంది స్వర్ణకారులు పనిచేస్తున్న స్వర్ణకార సంఘం భవనానికి లిఫ్టు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలపడంతో సుజనా ఫౌండేషన్ తరపున లిఫ్టు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సొంత నిధులతో శివాలయం వీధిలోని స్వర్ణకార సంఘం భవనంలో లిఫ్ట్ ఏర్పాటుకు శనివారం ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ స్వర్ణకార సంఘం నేతలతో కలిసి లిఫ్ట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

రైతులకు సాగునీరందించడమే లక్ష్యం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే తాతయ్య అన్నారు. శనివారం మండలంలోని వేదాద్రి కృష్ణా నది ఒడ్డున నిర్మిస్తున్న వేదాద్రి ఎత్తిపోతల పథకం పనులను ఎమ్మెల్యే రాజగోపాల్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై అధికారులతో కలిసి సమీక్షించి మ్యాప్‌ను పరిశీలించారు. ఎత్తిపోతల పథకంతో పాటు పైపు లేని పనులను ఆయన పరిశీలించారు, లిఫ్ట్ స్కీమ్‌కు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఫలితంగా స్కీం పనులు పూర్తి చేసి తద్వారా ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరందించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఎంఎల్‌ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసి 1 వైస్ చైర్మన్ మన్నే నారాయణరావు, బండి వంశీ, కన్నా జానకిరామయ్య, కన్నా రవి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి - వత్సవాయి : ఈ నెల 18న వరి మాగాణిలో ఆపరాల సాగు సవాలు, భవిష్యత్తు కార్యాచరణ అంశంపై కిసాన్ మేళా వ్యవసాయ పరిశోధనా స్థానం, ఘంటసాల వేదికగా నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ కెఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుత రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులు చేర్చాగోష్టి క్షేత్ర సందర్శన, వ్యవసాయ ప్రదర్శన రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతులు విశిష్ట సంఖ్య పొందాలి : ఎడిఎ

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందాలంటే ప్రతి రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలని జగ్గయ్యపేట ఎడిఎ సి.భవాని అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో రైతు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు వారి గ్రామ పరిధిలోని సేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నిమిత్తం ఫోన్ నెంబర్ ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అన్ని పథకాలు పొందాలంటే రైతుకు విశిష్ట సంఖ్య అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒలు రామ్కుమార్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంటల తవ్వకాలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో భూగర్భ జల వనరులు పెరగడం కోసం ప్రతి ఇంటిలోను ఇంకుడు గుంటలు తవ్వాలని ఇన్చార్జి తహశీల్దార్ వేమూరి మానస కోరారు. శనివారం ఉదయం కంచికచర్ల అంబేద్కర్ కాలనీలో ఇంకుడు గుంతలను ఆమె పరిశీలించారు. ఇంటిలోని నీరు బయటకు వెళ్లే ప్రాంతంలో ఇంకుడు గుంతను తవ్వితే ఇంటి ఆవరణలో కురిసిన వర్షపు నీరు, ఇంట్లో వాడుకున్న నీరు మొత్తం ఈ ఇంకుడు గుంతలోకి వెళ్ళేలా చూసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని ఎన్‌ఆర్ఇజిఎస్ రమాదేవి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి రాయితీపై ఇంకుడు గుంతలను తవ్వుతున్నామని ఆమె తెలిపారు. ప్రజలు ముందుకు వచ్చి తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాస్ పంచాయతీరాజ్ ఎఇ రవికుమార్ పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : అంగన్వాడీ కేంద్రాల్లో ఆరు సంవత్సరాలలోపు పిల్లల సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్ట్ అధికారి జీ.సత్యవతి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ పోషణ్, జాతీయ విద్యా విధానం కింద గుర్తించ బడిన పిల్లల్లో కీలక అభివృద్ధి, వారి నైపుణ్యాలను పెంపొందించడంపై అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దఋష్టి సారించడం పోషణ్ బి పడాయి బీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ శిక్షణ ద్వారా పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం అందించడం, వారి విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు అంగన్వాడీ కార్యకర్తలు అనుసరించాల్సిన విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామని సత్యవతి పేర్కొన్నారు. ఈ మూడు రోజుల సమగ్ర శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని కోరారు. సీడీపీవోతో కలిసి అంగన్వాడీ ఏసీడీపీవో జీ.ఝాన్సీ, సూపర్వైజర్లు రాజేశ్వరి, భవానీ ఆన్లైన్ విధానంలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

యువతరం ప్రతిభకు సాధన తోడవ్వాలి : యల్లాప్రగడ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : యువతరం ప్రతిభకు సాధన తోడైతే అద్భుతమైన కవిత్వం ఆవిష్కృతమవుతుందని ప్రముఖ సాహితీవేత్త, గుంటూరు హిందూ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న 'వచన కవిత్వ రచన కార్యశాల' శనివారం ముగిసింది. ముగింపు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లికార్జునరావు మాట్లాడుతూ సమాజ ఇతివృత్తాలన్నీ కవిత్వానికి వస్తువు అవుతాయన్నారు. మనసులోని అనుభూతిని అక్షరాల్లో ఆవిష్కరించే నేర్పు గురించి ఆయన వివరణాత్మకంగా ప్రసంగించారు. సాహిత్య విమర్శకులు బండ్ల మాధవరావు వచన కవిత్వ రచనకి ఎంచుకోవాల్సిన వస్తువు, కవితా నిర్మాణం, శైలి గురించి ఉదాహరణలతో వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మాతృభాషలో రచన పట్ల విద్యార్థులకు ప్రేరణ కలిగించడం లక్ష్యంగా కార్యశాల నిర్వహించామన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు మాట్లాడుతూ మొత్తం 9 కళాశాలల నుంచి 91 మంది డిగ్రీ విద్యార్థులు కార్యశాలలో పాల్గొన్నారని తెలిపారు. 'యువతరం' అంశం పై నిర్వహించిన కవితల పోటీ విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. మొదటి బహుమతి పి.మెహరాజ్ ఖానం (ఎస్.ఆర్.ఎస్.వి. బీఈడీ కాలేజీ), రెండవ బహుమతి కె.ఎల్.రాధశ్రీ (సిద్ధార్థ మహిళా కళాశాల), తతీయ బహుమతి జె.సౌమ్య (ఆంధ్ర లయోలా కళాశాల) అందుకున్నారు. తెలుగు అధ్యాపకులు ఆర్.జితేంద్ర కుమార్, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



కార్యశాల ముగింపులో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, సిబ్బంది

17న బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి-2025 సందర్భంగా ది.24-02-2025 నుండి 28-02-2025 వరకు అనగా '5' రోజులు కాలపరిమితికి గానూ లడ్డూ పటికబెల్లం ప్రసాదం విక్రయం చేసుకొను లైసెన్సుకు ఈ నెల 17న దేవస్థాన ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు రూ.10వేలు ధరావత్తు చెల్లించి సదరు వేలంపాటలో పాల్గొనవచ్చని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో నిత్య అన్నదానానికి హైదరా బాదు న్యూనాగోల్ ప్రాంతానికి చెందిన ఎం.కృష్ణదీప్ రూ.15,116 లు, ఎఇఒ తిరుమలేశ్‌రావు చేతులు మీదుగా అంద జేశారు. ఏ విధంగా నిత్యాన్నదాన పథకానికి మండలంలోని కొనకంచి గ్రామానికి చెందిన కర్రీ వెంకటేశ్వరావు రూ.11,011లు అంకమ్మ ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి విరాళంగా అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వాసన్ ఐ కేర్ సహకారంతో కెబిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం శనివారం కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 500 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ సిహెచ్.గోపీకృష్ణ, డాక్టర్ పఠాన్ ఖాషియా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 33 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స, 10 మందికి సర్జరీ అవసరమైందని, వీరికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తామని డాక్టర్ గోపీకృష్ణ చెప్పారు. తొలుత జరిగిన సభా కార్యక్రమంలో హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణ వేణి మాట్లాడుతూ సూచనలిచ్చారు.

ఆక్రమణ తొలగింపు


ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నాగులూరు గ్రామంలో గల రీసర్వే. నెం.లు 372/3 ఎ.0.65 ట్లు, 373లో ఎ.0.65 ట్లు ఎఫ్ఎల్ఎల్ఆర్ వాగుపోరంబోకుగా గల ప్రభుత్వ భూమిని మోర్ల సామ్రాజ్యం అనే వ్యక్తి ఆక్రమించి రాళ్ళు ముళ్లతీగ వేసి ఆక్రమణ చేసిన భూమిని తొలిగించాలని రంగాపురం శివారు బూరుగుగూడెం గ్రామ వాస్తవ్యులు గుంటక సీతారెడ్డి వేసిన పిటిషన్ నెం.580/2022/బి2 గౌ.లోకాయుక్త కోర్టు కర్నూలులో పిటిషన్‌పై కోర్టు ఉత్తర్వులు ప్రకారం అక్రమదారులకు 2 సార్లు నోటీసులు ఇచ్చారు. వారు స్వచ్ఛందంగా తొలగించనందున శనివారం తహశీల్దారు సుశీలదేవి పిటిషనర్ సమక్షంలో పొక్లెయిన్‌తో తొలగించారు.

10 రోజులపాటు ఉచిత మధుమేహ మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - భవానీపురం : పేదవారికి కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని భవానీపురంలోని నాగార్జున వీధిలో ఉన్న శ్రీ భవానీ హాస్పిటల్ వైద్య బృందం శనివారం ఉదయం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 15 నుండి 25 తేదీ వరకు 10 రోజుల పాటు ప్రతి ఒక్కరికీ రూ.2 వేల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ఈ శిబిరానికి సంబంధించిన బ్రోచరును వైద్య బృందం ఆవిష్కరించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 12 గంటలు వరకూ ఈ వైద్య సేవలు అందించేందుకు తామంతా సిద్ధంగా ఉంటామని వారు ప్రకటించారు. విజయవాడ నగరంలో 24/7 అత్యవసర వైద్య సేవలందించే 'క్యాత్ ల్యాబ్, డయాలసిస్' సౌకర్యం కలిగిన ఏకైక ఆసుపత్రి తమదని వారు వివరించారు. ఈ పదిరోజుల పాటు తాము అందించే ఇ ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వైద్యులు ఈ సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, జీర్ణకోశ, సాధారణ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వెనిగళ్ల చంద్ర శేఖర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శివరామకృష్ణ, ప్రముఖ నెఫ్రాలజీస్టు డాక్టరు భారతి కాసినబోయిన, చీఫ్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్, ఎన్.పి.దిలీప్ కుమార్, ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ సిహెచ్.వెంకట్, ప్రముఖ యూరాలజిస్టు డాక్టరు అభిలాష్, పాల్గొన్నారు.



తడి, పొడి చెత్తలపై అవగాహన అవసరం



ఉయ్యూరులో సుబ్బారావుకు పురస్కారం అందిస్తున్న అరుణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఇళ్లలో చెత్త ఇతర వ్యర్థాలను తడి, పొడిగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందచేయాలని జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాటూరులో పర్యటించి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గృహాలనుంచి ఇచ్చేచెత్త తడి, పొడి, ప్రమాకర చెత్తగా వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓ పీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు తదితరు లు పాల్గొన్నారు.

కాటూరు కార్యదర్శి సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా ఛాంపియన్ పురస్కారం

కాటూరు పంచాయతీ కార్యదర్శి పీవీ సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా పురస్కారం లభించింది. స్వచ్ఛ దిస్ సందర్భంగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచినందుకు ఉయ్యూరు మండల పరిధి లో జిల్లా కలెక్టర్ నుంచి సుబ్బారావుకు పురస్కారం లభించగా శనివారం జిల్లా పంచా యతీ అధికారి జె అరుణ నుంచి జ్ఞాపిక ప్రశంస పత్రం అందుకున్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, ఈ ఓపీఆర్డీ కోటేశ్వరరావు, సుబ్బారావును అభినందించారు. పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** తడి పొడి చెత్తను వేరు చేయాలని అలా చేయడం ద్వారా సంపద తయారీకి దోహద పడుతుందని మానికొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి విఎస్ ప్రకాష్ నాథ్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా శనివారం మానికొండ గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సిబ్బందితో ప్రదర్శన నిర్వహించిన అనంతరం ప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** తడి,పొడి చెత్తలపై పిల్లలకు అవగాహన ఉండాలని గన్నవరం పంచాయతీ సెక్రెటరీ చెన్నకేశవరావు అన్నారు. శనివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తడి- పొడి చెత్త పై పిల్లలకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో తడి చెత్తను, పొడి చెత్తను విడివిడిగా రెండు డబ్బాల్లో వేయాలన్నారు. పంచాయతీ కార్మికుడు సప్త సేకరణకు వచ్చిన సమయంలో వాటిని విడివిడిగా అప్పగించాలన్నారు. తడి చెత్తను, పొడి చెత్త నుంచి వర్మి కంపోస్ట్ తయారవుతుందన్నారు. దానిని ఎరువుగా ఉపయోగించి మొక్కలకు వేస్తారన్నారు. పిల్లలు ఈ విషయాలను గమనించి ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పిల్లల దశ నుంచి ప్రతి ఒక్క కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ప్రాణవాయువు కోసం అందరూ మొక్కలు నాటాలని పమిడిముక్కల మండల అభివద్ధి అధికారి డి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారంకపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలో తడి పొడి చెత్త వేరు చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం నెలలో తప్పక అన్ని పంచాయతీలు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేయాలని ఆయన అన్నారు. తాడంకి, లంకపల్లి, కృష్ణాపురం పంచాయతీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్వచ్ఛ కార్యక్రమాలు జరిగాయి. **ప్రజాశక్తి-చల్లపల్లి :** ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత పరిసరాలను మెరుగుపరచవచ్చని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ శ్రీరంగం శ్రీనివాసరావు అన్నారు. చల్లపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్యశాల నందు తడి చెత్త, పొడి చెత్త, చెత్తబుట్టల నిర్వహణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవినాష్, డాక్టర్ ఉమా మహేష్, డాక్టర్ వంశీ, వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అంతా కలిసి శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి బి ఆనంద కుమార్ సారథ్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు అంతా కలిసి బంటుమిల్లి ప్రధాన వీధుల్లో ర్యాలీ ప్రదర్శన చేసి, తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా ఉంచి,ఆరోగ్య పరిరక్షణ చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బండి దేవ జయరాజు, ఎన్. ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి డా.ఆనంద్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి వీధికి తిరుగుతూ తడి చెత్త, పొడి చెత్త, చెత్తబుట్టల నిర్వహణపై పారిశుద్ధ్య కార్మికులకు, ప్రజలకు ఎంపీడీవో, గ్రామ స్పెషల్ ఆఫీసర్ టి విజయ సారథి, కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావులు అవగాహన కల్పించారు. పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయితీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా శుభ్రతపై ప్రతిజ్ఞ నిర్వహించారు.

గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక అన్నే నరసింహారావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంద్ర కార్యమ్రాన్ని వైద్యులు, సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇందిరాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో 3వ శనివారం స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో చెత్తను తొలగించామన్నారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు, శానిటేషన్, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్స్‌లు, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అందరి చేత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ వీర కుమారి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్ అంకారావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ రవిబాబు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



గుడివాడలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యులు



పమిడిముక్కల మండలంలో...

స్వచ్ఛ ఆంధ్రపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయటంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ మీటింగ్ హాల్ లో నిర్వహించి ఉద్యోగులచే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవో కే స్వాతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి వీరాంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : డిఎంహెచ్ఒ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని జిల్లా వైద్యాధికారిణి ఎస్. శర్మిష్టా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం భవనం పైన పేరుకుపోయిన చెత్తాచెదారాలను జిల్లా వైద్యాధికారి సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని, ఇంటి పరిసరాల పరిశుభ్రతతో కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 104 నోడల్ అధికారిణి విజయభారతి, 104 మచిలీపట్నం డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్ళు, వైద్యాధికారులు నిరీక్షణ, అరుణ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తను ఊడుస్తున్న డిఎంహెచ్ఒ



ఉంగుటూరులో మాట్లాడుతున్న అధికారులు

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఉంగుటూరు : పోషకాహారంపై దష్టి సారించడం తోపాటు, అంగన్వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్, నాన్ ఫార్మల్ విద్యా నాణ్యతను మెరుగుపర్చడానికి కషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జె. సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ బి పద్మావతిదేవి అధ్యక్షతన నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎల్ దుర్గాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ అనిత తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- గుడ్లవల్లేరు :** వికలాంగ పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసిడిఎస్ సిడిపిఓ విజయ ఫ్లోరెన్స్ తెలిపారు. మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా జరుగుతున్న పోషన్ భీ పఢ్డాయి భీ శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ విజయ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ పోషకాహారం, పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ సి డిపిఓ పద్మావతి, సూపర్వై జర్స్ ఈ. వాణి, ఆరిఫా అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు మండలంలో...

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి 2025 కేలండర్‌ను శనివారం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం స్వాతంత్ర సమరయోధులు చిరస్మర ణీయులని తెలిపారు. ఎంతోమంది ముస్లిం స్వాతంత్ర సమరయోధులు దేశ స్వాతంత్రం కోసం ప్రభావంతమైన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ఘంటసాల జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ బాష జామియా ,మసీద్ ఇమామ్ అబ్దుల్ గఫార్ ఉపాధ్యక్షులు మహబూబ్ సుభాని పాల్గొన్నారు



రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షునిగా లంకిశెట్టి నియామకం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : జాతీయ కాపు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షునిగా మచిలీపట్నం కు చెందిన ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీని, విజయవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన మరో సీనియర్ న్యాయవాది బత్తిన హరిరామ్‌ని రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమిస్తూ జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకష్ణ నాయుడు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కష్ణా జిల్లా అధ్యక్షులు జి. నాగరాజు.. లంకిశెట్టికి నియామక ఉత్తర్వులను శనివారం మచిలీపట్నంలో అందజేశారు. లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు మురళీకష్ణకు లంకి శెట్టి ధన్యవాదాలు తెలియజేశారు

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడ ఆధ్వర్యంలో గన్నవరంలోని శ్రీ మల్లికార్జున పబ్లిక్ స్కూల్ పాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె జబ్బులు, మెదడు మరియు నరాల వ్యాధులు, షుగర్,థైరాయిడ్, జీర్ణకోశ వ్యాధులు, కీళ్ల వాతం, ఎముకలు, కీళ్ల సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, జనరల్ మెడిసిన్ మరియు స్త్రీ ల ఆరోగ్య సమస్యలు మొదలైన వివిధ వ్యాధులకు వైద్యులు చికిత్సలు చేశారు. ఈ శిబిరంలో 900 మందికి అవసరమైన వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించారు. రెడ్ క్రాస్ ఛైర్ పర్సన్ చిన్ని మాధవి , రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.ఎస్.ఆర్.కే ప్రసాద్, డా . పి వసుందర దేవి పాల్గొన్నారు. మల్లికార్జున పబ్లిక్ సంస్థల డైరెక్టర్ నక్కిన చిన వెంకటరాయుడు, దాసరి మాధవీలత పర్యవేక్షించారు.

స్వచ్ఛ ఛాంపియన్లకు సత్కారం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా స్వచ్ఛతను చిత్తశుద్ధికి నిర్వహిస్తున్న ఛాంపియన్లను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఈవారం ఇతివత్తమైన సోర్స్ - రిసోర్స్ లో వినూత్న కార్యక్రమాలను నిర్వహిం చారు. మచిలీపట్నం గొడుగుపేట కు చెందిన సౌభాగ్యవతి, రైల్వే స్టేషన్ సమీపంలోని మల్కాపట్నంకు చెందిన నందిని లను "స్వచ్ఛ మచిలీపట్నం ఛాంపియన్స్" అవార్డుతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెత్త నుండి సంపద తయారీ ఇతివత్తంగా గత 20 సంవత్సరాలుగా ఇంటిలోని చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చి పండ్ల, కూరగాయ, పూల మొక్కలను పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు సహకారం అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛాంధ్ర, హరితాంధ్ర, ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా పాటు పడాలని సూచించారు. బందరు ఆర్డిఓ కే స్వాతి , మచిలీ పట్నం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



స్వచ్ఛ పురస్కారం అందిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఘటన ఒకటే... గుణపాఠాలు అనేకం...

విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లోని జలకన్య ఎగ్జిబిషన్‌లో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదం తీరు ఈ వేసవి కాలానికి ఒక హెచ్చరిక లాంటిది. అగ్నిప్రమాదాలు... వాటి నివారణకు ముందుస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు... చర్యలు... నిబంధనలు పాటించకపోతే జరగబోయే పరిణామాలపై అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు ఒక గుణపాఠం లాంటిది. ఎగ్జిబిషన్ ఘటన ఒక్కటే... కానీ దీన్ని లోతుగా పరిశీలిస్తే అనేక విస్తుపోయే, ఆశ్చర్యకరమైన విషయాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నింటినీ వదిలేసి అవినీతి గడ్డి కరిస్తే ఎటువంటి దారుణాలు... విపత్కర పరిస్థితులు ఎదురవుతాయో ఎగ్జిబిషన్ అగ్నిప్రమాదం విధితం చేస్తుంది. ఈ ఘటనకు కూతవేటు దూరంలోనే మునిసిపల్ స్కూల్‌లో వందల మంది విద్యార్థులున్నారు. ఘటన జరిగీ జరగకముందే విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటకు పరుగులు తీశారు. ఎగ్జిబిషన్‌లోని 38 స్టాల్స్‌లో 13 షాపులు అగ్నికి ఆహుతై భారీ మొత్తంలోనే నష్టం వాటిల్లినట్లు నిర్వాహకుల నుంచి వ్యక్తం అయింది. 90 రోజుల వరకు ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతి ఇచ్చిన అధికారులు వంద రోజులకు పైగా కాలం గడిచినా వారికి పట్టనట్లుగా వ్యవహరించారు. అగ్నిప్రమాదం జరిగితే తప్పా అప్పటి వరకు ఏ ఒక్క అధికారీ కూడా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఈ ఘటనే జరగకపోయి ఉంటే...ఎన్ని రోజులయినా ఎగ్జిబిషన్ నడుస్తూనే ఉండేదని, తద్వారా నగరపాలక సంస్థకు, మిగిలిన ఇతర ప్రభుత్వ శాఖలకు ఆర్థికంగా, ఇతర అనేక రూపాల్లో నష్టం వాటిల్లేదని అగ్నిప్రమాదం జరిగిన తీరుపై స్వయంగా నగర మేయర్ జిల్లా కలెక్టర్, నగర కమిషనర్‌కు రాసిన లేఖ తీరు ప్రస్ఫుటం చేస్తుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్ అనుమతి దగ్గర నుంచి అన్ని రకాలుగా పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ పాలకవర్గం, నగర కమిషనర్ సాచివేత వైఖరిని కూడా స్థానిక ప్రజలు తప్పు పడుతున్నారు. ఘటనకు కారణమైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, చేతులు దులుపుకోవడానికి పరిమితం కాకుండా నగర కమిషనర్ సమగ్ర విచారణ చేపట్టి, అసలు నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని, మరో సారి ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు పాటించే దగ్గర నుంచి, ఇతర అన్ని రకాల అనుమతులు పొందడం, పన్నుల చెల్లింపులు తదితర అంశాల వరకు అంతా డొల్లగా, మోసమని తెలుస్తుంది. పదులు సంఖ్యలో స్టాల్స్‌తో జలకన్య ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ... లక్షల్లో రాబడి పొందుతున్నప్పటికీ... డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిగా నిర్వహకులు తీసుకోవాల్సి ఉన్నా.. సంబంధిత ప్రజారోగ్య విభాగం అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేశారు. దీనికి అవసరమయ్యే విద్యుత్‌ను సైతం అధికారికంగా తీసుకోకుండానే దొడ్డిదారిని భారీ మొత్తంలో వాడుకున్నారు. ముఖ్యంగా గడువు ముగిసిన తరువాత నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేసి, గడువును రెన్యువల్ చేయాల్సిన బాధ్యతను ఎస్టేట్ విభాగం పూర్తిగా విస్మరించింది. ఇంతటి భారీ స్థాయిలో ఎగ్జిబిషన్ జరిగే ప్రాంతంలో అనుకోకుండా ప్రమాదం జరిగినా దానిని ఆర్పేవిధంగా 50 వేల లీటర్ల నీటి సదుపాయం అందుబాటులో ఉంచాలి. ఎగ్జిబిషన్ నిర్మాణ స్ట్రక్చర్ తీరు ప్రమాదాలు నివారించేలా కూడా లేదు. కమర్షియల్ టాక్స్ అధికారులు జిఎస్టీని కూడా కట్టించుకున్నారో లేదోననే సందేహం కలగక మానదు. కమర్షియల్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగించారు.

జిల్లాలో ఫైర్ సేఫ్టీ అధికారుల దగ్గర నుంచి వారి సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. విజయవాడ నగరం లోని ఆటోనగర్, సింగ్‌నగర్, కొత్తపేట, విజయ వాడ-1... నాలుగు ఫైర్ స్టేషన్లతో పాటు జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, విసన్నపేట, మైలవరం మొత్తం తొమ్మిది ఫైర్ స్టేషన్లు ఉన్నప్పటికీ...భారీ సంఖ్యలోనే క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఏళ్ల తరబడి వెంటాడుతూనే ఉంది. ఉదాహరణకు విజయవాడలోని కొత్తపేట ఫైర్‌స్టేషన్‌లో ఒక స్టేషన్ ఫైరాఫీసర్, వాహన డ్రైవర్, మరొకరు సిబ్బంది మాత్రమే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పదులు సంఖ్యలోనే సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది. తగిన సంఖ్యలో వాహనాలు కూడా లేవు. ఇటవంటి పరిస్థితుల్లో వేసవిలో మరో సారి ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

- విహెచ్ఆర్



కస్టమర్ మీట్‌కు హాజరైన బ్యాంకు ప్రతినిధులు, సిబ్బంది

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కస్టమర్ మీట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆటోనగర్‌లో గల ఆటోమొబైల్ టెక్నీషియన్ హాల్ లో ఎం. ఎస్. ఎమ్. ఈ కస్టమర్ మీట్ జరిగింది. బ్యాంక్ విజయవాడ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా మాట్లాడుతూ బ్యాంక్ ఎం ఎస్ ఎమ్ ఈ విభాగం కింద 230 కోట్లు సమీకరించినట్లు తెలిపారు.తొలుత కార్యక్రమాన్ని స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు వాసిరెడ్డి మురళి కృష్ణ,ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజనాల వెంకట రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలో ప్రతిభ చూపిన సస్టైనబిలిటీ ఛాంపియన్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ నుండి ఇద్దరు సస్టైనబిలిటీ ఛాంపియన్లు సైన్స్, కళను కలిసే మొట్టమొదటి వేదిక అయిన సస్టైనా ఇండియా 2025లో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అని నిర్వాహకులు ఎం.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియా ఆర్ట్ ఫెయిర్ సందర్భంగా ఫిబ్రవరి 2-16 వరకు న్యూఢిల్లీలోని స్టిర్ ఆర్ట్ గ్యాలరీలో జరుగుతున్న ఈ ప్రదర్శనను 'విత్ ఈచ్ సీడ్ వి సింగ్' అనే పేరుతో నిర్వహిస్తున్నారు.అని తెలిపారు. విజయనగరానికి చెందిన చిరు ధాన్యాల రైతు , మహిళా సాధికారత నాయకురాలు సరస్వతి మల్లువలస , హైదరాబాద్ నుండి డిజైనర్ మరియు పత్తి సస్టైనబిలిటీ ప్రచారకుడు పోలుదాస్ నాగేంద్ర సతీష్ పాల్గొన్నారని అన్నారు. సంప్రదాయం , ఆవిష్కరణలలో లోతుగా పాతుకుపోయిన వారి పని, ఆంధ్ర మరియు తెలంగాణ లు పర్యావరణ అనుకూల వ్యవసాయం మరియు వస్త్రాలలో ఎలా ముందుండగలదో ప్రదర్శన ద్వారా తెలిపి ఆకట్టుకున్నారన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శన

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక డాక్టర్ లకిరెడ్డి హమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ వక్ష శాస్త్రం మొదటి సంవత్సరం విద్యార్థులు విజయవాడలో పివి సిద్ధార్థ కళాశాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వృక్ష, జంతు శాస్త్ర విభాగాల మ్యూజియాలను సందర్శించారు. ఎగ్జిబిషన్లో జరిగిన వివిధ రకాల సైన్స్ క్విజ్, న్యూ ఐడియాస్‌లో పాల్గొన్నారు. ఈ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి జయ రాముడు, జంతుశాస్త్ర అధ్యాపకులు టి.సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని గంగవల్లి గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు, అల్లూరుపాడు గ్రామానికి చెందిన గంగదారి శ్రీనివాసరావు, వత్సవాయి గ్రామానికి చెందిన కనతాల భార్గవ్, మాచినేనిపాలెం గ్రామానికి చెందిన గట్టిగుండె వంశీకి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్ల మూడి రాంబాబు, తొండపు జగన్మోహన్ రావు, పాల్గొన్నారు.

లిటిల్ బ్రైన్స్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రైన్స్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఆట పాటలతో అలరించి, నృత్య ప్రదర్శనలు చేశారు. పిల్లలు అనేక రకాలైన ప్రతిభలను తమ తల్లిదండ్రుల వద్ద ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'బాల వినోదం' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, పాఠశాల డైరెక్టర్ ప్రముఖ విద్యావేత్త ముక్తేవి ఫణి ప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లలకు ఒత్తిడి లేకుండా ఆట పాటలతో చదువు నేర్పించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ప్రిన్సిపాల్ సుధ ప్రవీణా ముక్తేవి, అకడమిక్ డీన్ డి.గిరి శేఖర్ పిల్లలు అందరినీ ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలకు గ్రాడ్యుయేషన్ పట్టాలను, బహుమతులను అందించారు. స్కూల్ విద్యార్థి దేవరుషి తెలుగు సంవత్సరాల పేర్లు 60 ఆగకుండా చెప్పి అందరినీ ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు



ఆకట్టుకున్న వీణా నాద నీరాజనం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో శనివారం కచ్ఛపీ అఖండ మహోత్సవం జరిగింది. దసరా నవరాత్రుల అవతారాల్లో మూలానక్షత్రం రోజు సరస్వతిమాతగా అమ్మవారిని అలంకరించి జ్ఞానప్రదాయనిగా అర్చించే ఆ మాత చేతిలో ఉండే వీణను కచ్ఛపి అని పిలుస్తారు. కచ్ఛపి పేరిట 9వ వార్షిక అఖండ మహోత్సవం భాగవతుల హైట్స్‌లో ఉదయం 7:30 నుంచి రాత్రి 9:30 వరకు రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి దాదాపు వందమంది వర్ధమానులు, ఔత్సాహికులు స్వర నివేదనలందించారు. సద్గురు త్యాగరాజ స్వామి వారి ఘనరాగ పంచరత్న కీర్తనలతో వైణిక విద్వాంసులు, కళాకారులు, అభ్యాసకులు వాయించి వినిపించారు. ఉత్సవాన్ని ప్రముఖ సంగీత విద్వాంసులు ముఖ్య అతిథులుగా కె.ఎస్.గోవిందరాజన్, సద్గురు చరణ్, సమితి కార్యదర్శి సివి.రావు దంపతులు ఉత్సవాన్ని ప్రారంభించి భవిష్యత్తరానికి వీణ గొప్పదనాన్ని, వీణా వాయిద్యంలోని ప్రత్యేకతను తెలుపుతూ వేదికలు కూడా కల్పిస్తున్న సంస్థ నిర్వాహకులను ప్రశంసిస్తూ ప్రసంగించారు. అయ్యగారి సత్య ప్రసాద్, చిట్టా కార్తీక్, కొండా శశిధర్, శంకర సుజాత, సాత్విక, లలిత, శివప్రియ, లేహవర్ణ, రావుల మీరా, ఉదయలక్ష్మి, కళ్యాణి, రామలక్ష్మి, కనకదుర్గ ప్రసాద్, ఫణి శిరీష తదితరులు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పలువురు వాగ్గేయకారుల కీర్తనలను రసరమ్యంగా వాయించి శ్రోతల హృదయాలను సంగీతరస జగత్తులో విహరింప చేశారు. వీరికి మృదంగంతో సద్గురు చరణ్, బివిఎస్ ప్రసాద్, ఎన్ఎస్ కళ్యాణ్ రామన్, కుందుర్తి అరవింద్ తదితరులు రక్తిగా నిండుగా సహకరించారు.

వేసవి సెలవుల్లో కాశ్మీర్ టూర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ వేసవి కాలంలో 33 శాతం సబ్సిడీతో 'కాశ్మీర్ టూర్' విహార యాత్రికులకు మధురానుభూతి కలగజేయనున్నట్లు భారతీయ రైల్వే సౌత్‌స్టార్ రైల్ ప్రతినిధి విఘ్నేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రైల్వేలు, భారత్ గౌరవ్ ట్రైన్ ఆపరేటర్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ ఇండియాతో కలిసి కాశ్మీర్, ఆగ్రా, ఢిల్లీ, అమృతసర్ వంటి ప్రముఖ గమ్యస్థానాలకు వేసవి సెలవుల ప్రత్యేక రైలు టూర్ ఉందన్నారు. ఈ 15 రోజుల ప్రత్యేక ప్యాకేజీ ఏప్రిల్ 2న ప్రారంభమవుతుందని తెలిపారు. బుకింగ్‌లు ఇప్పుడు ఓపెన్ అయ్యాయన్నారు. 1 ఎసి, 2 ఎసి, 3ఎసి, స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్, భద్రతా సిబ్బందితో అత్యంత సురక్షితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. సైట్‌సీయింగ్, హోటల్ వసతి, రాత్రి బస ఉంటుందన్నారు. ప్రయాణం అంతటా దక్షిణ భారతీయ భోజనం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాల సందర్శన సమయంలో లగేజీని కోచ్‌లో ఉంచే సౌకర్యం ఉందన్నారు. ఈ పర్యటన వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ ప్రత్యేక ప్యాకేజీ 3ఏసీ రూ.49,900, 2ఏసీ రూ.60,100, 1ఏసీ రూ.65,500 కలదన్నారు. బుకింగ్ కోసం 7305858585 నంబరులో సంప్రదించాలని కోరారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం : కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : స్వచ్ఛాంధ్రా - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ విలేజ్ - గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్రా - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జిల్లాలోని ప్రతి నెలా మూడో శనివారం ప్రతి గ్రామంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. మూడు విధాలుగా చెత్తను విడగొట్టడం ద్వారా (సోర్స్ - రిసోర్స్) సంపద సృష్టించుకోవచ్చని అధికారులకు, ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు, గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం చేశారు. అనంతరం రెడ్డిగూడెం నుండి కుదప వెళ్లే రహదారిలో ఉన్న చెత్తను తొలగించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి, జిల్లా హార్టికల్చర్ అధికారి బాలాజీ కుమార్, తిరువూరు ఆర్‌డిఒ మాధురి, డిఎల్‌పిఒ ప్రసాద్, ఎండిఒ రమణ, తహశీల్దార్ సుశీలదేవి, విస్సన్నపేట ఎపిడి పార్థసారథి, ఇఒపిఆర్‌డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీ శ